
సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం । 9 । జనవరి । 2024



.. ఇప్పట్లో లేనట్లే

ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు.

వివరాలు 8లో ▸



జాతీయస్థాయికి ఎదగాలి

జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే యెన్నం అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 32.5 /16.6

వాతావరణం

చలి ప్రభావం అధికంగా ఉంటుంది. విపరీతమైన మంచు కురుస్తుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ ఎంట్రీని సకాలంలో పూర్తిచేయాలి



అడ్డాకుల: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు అభయహస్తంతోపాటు ఇతర సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సోమవారం అడ్డాకుల మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలించారు. డేటా ఎంట్రీలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ ప్రక్రియకు సాంకేతిక సమస్యలు తెలెత్తకుండా చూడాలని చెప్పారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీపై అధికారులతో సమీక్షించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, ఎంపీఓ శ్రీదేవి, సూపరింటెండెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ సీట్ల భర్తీకి.. దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని రాంరెడ్డిగూడెం వద్ద ఉన్న ఎస్సీ గురుకుల కళాశాలలో 2024– 25 విద్యా సంవత్సరం ఇంటర్ సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ఈనెల 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

5వ తరగతి ప్రవేశాలకు తేదీ పొడిగింపు

వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించే తేదీని ప్రభుత్వం పొడిగించిందని రాంరెడ్డిగూడెం ప్రిన్సిపాల్ వాణిశ్రీ తెలిపారు. ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

ప్రతి టీచర్ శాస్త్రవేత్తగా మారాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రతి ఒక్క టీచర్ కూడా శాస్త్రవేత్తగా మారాల్సిన అవసరం ఉందని డీఈఓ రవీందర్ అన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి వద్ద ఉన్న సైన్స్ మ్యూజియంలో టెక్ మహీంద్ర, సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సైన్స్ టీచర్ల శిక్షణ ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బోధన విధానంలో భాగంగా తప్పకుండా ప్రయోగాలు చేసి చూపించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, టెక్ మహీంద్ర ప్రతినిధులు స్రవంతి, సత్యానంద్, జనార్దన్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కందులు క్వింటాలు రూ.9,050


జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం కందులు క్వింటాలు గరిష్ఠంగా రూ.9,050, కనిష్ఠంగా రూ.8,550 ధర లభించింది. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్ఠంగా రూ.8,151, కనిష్ఠంగా రూ.5,069, ఆర్‌ఎన్ఆర్ రకం ధాన్యం క్వింటాలు గరిష్టంగా రూ.3,078, కనిష్టంగా రూ.2,516, హంస రకానికి గరిష్టంగా రూ.1,940, కనిష్టంగా రూ.1,890, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,291, కనిష్ఠంగా రూ.2,283, శ్రీరాం గోల్డ్ రూ.3,109 చొప్పున వచ్చాయి.

సోనామసూరి ధర రూ.3,112

దేవరకద్ర మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.3112, కనిష్ఠంగారూ.2,750 వచ్చింది. అలాగే కందులు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.8,569, కనిష్ఠంగా రూ.8,409 ధరలు చొప్పున పలికాయి.

ప్రయోగాలు చేసేదెలా?

ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో రసాయనాలు కరువు



- గత నాలుగేళ్లుగా అందని కెమికల్స్, మెటీరియల్స్
- అప్‌గ్రేడ్ చేసిన కేజీబీవీల్లో కనిపించని ల్యాబ్‌లు
- వచ్చే నెల 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు
- సమస్య పరిష్కారంపై దృష్టిసారించని విద్యాశాఖ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ముగింపునకు రావడంతో పరీక్షల హడావుడి ప్రారంభం కానుంది. వచ్చే నెల 1 నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మొదలవుతాయి. ఈ క్రమంలో ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ల్యాబ్స్‌లో సరైన వసతులు లేని పరిస్థితి. ప్రాకికల్స్‌కు హాజరయ్యే విద్యార్థులు కొన్ని రోజులపాటు సిలబస్‌లోని ప్రతి అంశంపై రోజూ ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. కానీ, ల్యాబ్స్‌లో పూర్తిస్థాయి వసతులు లేక విద్యార్థులు ప్రయోగాలకు దూరంగా ఉంటున్నారు. దీనికితోడు గత ఆరేళ్లగా ప్రభుత్వం సాధారణ కేజీబీవీలను ఇంటర్మీడియట్‌గా అప్‌గ్రేడ్ చేసింది. ఇలా చేసిన చాలా కేజీబీవీల్లో ఇప్పటికీ ల్యాబ్‌లు లేవు. దీంతో ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రాక్టికల్స్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

33 కేజీబీవీల్లో..

జిల్లాలోని 33 కేజీబీవీలను ప్రభుత్వం దశలవారిగా అప్‌గ్రేడ్ చేసుకుంటూ వచ్చింది. వీటిలో సైన్స్ గ్రూప్ ఉన్న కళాశాలలు 25 ఉన్నాయి. అయితే 2018 కంటే ముందు ఏర్పాటు చేసిన కొన్ని కేజీబీవీలకు అప్పుడు ప్రభుత్వం ల్యాబ్ మెటీరియల్స్, కెమికల్స్ పంపిణీ చేసింది. తర్వాత ఏర్పాటు చేసిన వాటికి అసలు ల్యాబ్స్ లేవు. ల్యాబ్స్ లేకుండా సైన్స్ గ్రూప్‌లు ఎలా కొనసాగిస్తున్నారనేది పెద్ద ప్రశ్నగా మారింది. దీంతో వాటిలో చదవుతున్న విద్యార్థులకు ప్రయోగాలు సాగడం లేదు. ప్రయోగాలు చేయకపోతే పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

అందుబాటులో లేవు..



కళాశాలలలో ల్యాబ్ సౌకర్యాలు అరకొర ఉన్నప్పటికీ ప్రయోగాలు చేసేందుకు పూర్తిస్థాయిలో కెమికల్స్ అందుబాటులో లేవు. కొత్తగా ఎలాంటి కెమికల్స్ లేవు. దీంతో పూర్తిగా పాత కెమికల్స్‌తో ప్రయోగాలు చేస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రయోగాలకు అవసరమైన మెటీరియల్స్, కెమికల్స్ సరఫరా చేయాలి. – నిహారిక, బైపీసీ, బాలికల జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్

ఫలితం ఉండటం లేదు..



చాలా వరకు ల్యాబ్‌లో గతంలో ఇచ్చిన కెమికల్స్‌తో ప్రయోగాలు చేస్తున్నారు. వాటిలో చాలా వరకు తేదీ అయిపోవడంతో అసలు కెమికల్స్ రియాక్షన్ ఉండడం లేదు. ప్రతిరోజు ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తే ప్రయోగ పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చు. కానీ, మాకు ఆ అవకాశం లేకపోవడంతో దీంతో ఇలా పరిస్థితి ఉంటే తక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంది. – నందిని, బైపీసీ, బాలికల జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్

సమస్యను పరిష్కరించాలి...



ల్యాబ్‌లో కెమికల్స్‌తోపాటు స్లైడ్స్, స్పెసిమన్స్ లేవు. దీంతో నామమాత్రంగా ప్రయోగాలు సాగుతున్నాయి. వెంటనే సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వాటిని సరఫరా చేయాలి. లేకపోతే మార్కుల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు వెనకబడే అవకాశం ఉంది. – లక్ష్మీదేవి, బైపీసీ, బాలికల జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ప్రభుత్వం గతంలో ప్రాక్టికల్స్‌కు సంబంధించిన కెమికల్స్ పంపిణీ చేసింది. కళాశాల ల్యాబ్స్‌లో ఇబ్బందులు ఉన్నాయని, కెమికల్స్, ఇతర మెటీరియల్స్ లేవనే విషయమై ఇంటర్మీడియట్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్కడ నిర్ణయం జరిగితే వాటిని సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయి. – వెంకటేశ్వర్లు, డీఐఈఓ, మహబూబ్‌నగర్

నాలుగేళ్ల కిందట..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 42 జూనియర్ కళాశాలలు ఉండగా.. 30 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌లు చదువుతున్న వారు 12,600 మంది ఉన్నారు. వీరు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే సాధారణ తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా హాజరవ్వాల్సి ఉంటుంది. అయితే ప్రయోగాలు చేయాలంటే తప్పకుండా కెమికల్స్ అవసరం. వీటితోపాటు స్లైడ్స్, స్పెసిమన్స్ వంటి అనేక రకాక మెటీయల్స్ కావాలి. కానీ, వాటిని 2018– 19 విద్యాసంవత్సరంలో చివరిసారిగా ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ తర్వాత కళాశాల అంతర్గత ఫండ్ నుంచి కొనే అవకాశం ఇవ్వలేదు. దీంతో గతంలో ఇచ్చిన అరకొర కెమికల్స్ తేదీ అయిపోయాయి. ఫలితంగా ప్రాక్టికల్స్ చేయకపోతే తమ మార్కుల పరిస్థితి ఏమిటని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్రస్థాయి ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధానంగా భూ సమస్యలు, పింఛన్లు, ఉపాధి వంటి అంశాలపై అధికంగా అందజేశారు. అనంతరం కలెక్టర్ వాటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మండల స్థాయిలో సమస్యలపై తహసీల్దార్లు, ఎంపీడీఓలతో మాట్లాడుతూ పరిష్కారంపై చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ యాదయ్య, జెడ్పీసీఈఓ జ్యోతి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వంగా..

గండేడ్ మండలం బల్సుర్‌గొండ శివారులో సర్వే నం.76, కొండాపూర్ శివారులో సర్వే నం.62లో 10 ఎకరాల భూమి మా పూర్వీకుల నుంచి మాకు, మా పాలేరులకు వారసత్వంగా రావాల్సి ఉంది. ఈ భూమిని ఎవరికి తెలియకుండా గ్రామానికి చెందిన మోహన్ అనే వ్యక్తి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పట్టా చేయించుకున్నారు. ఆ తర్వాత మరికొందరికి పట్టాను బదిలీ చేశారు. కుట్రపూరితంగా మాకు దక్కకుండా ఇతరులకు బదిలీ చేసిన భూమి పట్టాను రద్దు చేసి మాకు న్యాయం చేయాలని కోరుతూ సేవ్యానాయక్, రాజునాయక్, శంకర్, మేగ్యా, రవి వినతిపత్రం అందజేశారు.

పాస్‌బుక్‌లో నమోదు..



జడ్చర్ల మండలం నసురుల్లాబాద్ శివారులోని సర్వే నం.780లో 4.21 ఎకరాల విస్తీర్ణం భూమిని కొత్త పట్టాదారు పాస్‌పుస్తకంలో ఎక్కించాలని గతంలో ఎన్నోసార్లు కలెక్టరేట్‌కు తిరుగుతున్నా. సీసీఎల్ఏ అనుమతి కోసం పంపించామని చెప్పడంతో అక్కడికి వెళ్లినా పరిష్కారం కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చింది మళ్లీ కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోవాలని చెప్పారు. అందుకే కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పిర్యాదు సమర్పించేందుకు వచ్చానని బాధితుడు నర్సింహ కోరారు.

భూమి అడిగితే..



నా కొడుకు ఐదేళ్ల క్రితం గుండె జబ్బుతో చనిపోయారు. తర్వాత తన పేరు మీద ఉన్న 1.20 ఎకరాల భూమిని నా కూతురు పట్టా చేయించుకుంది. ప్రస్తుతం నన్ను పోషించకుండా భూమి అడిగితే తిండి పెట్టకపోవడంతోపాటు కొడుతుంది. నాకు తెలియకుండానే భూమిని మార్చుకొని ఇప్పుడు అమ్మేందుకు ప్రయత్నిస్తుంది. కూతురు నుంచి నా ఆస్తిని వెనక్కి ఇప్పించాలని జడ్చర్ల మండలం ఆలూరుకు చెందిన సాయమ్మ వాపోయింది.

రిజర్వేషన్లలో రోస్టర్ విధానం



రోస్టర్ విధానంలో రిజర్వేషన్లు అమలుపర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే వెనకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బాలయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రిజర్వేషన్ల అంశంపై పూర్తిస్థాయిలో పరిశీలించి అన్ని కులాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోస్టర్ విధానంలో రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో మేలు జరిగే ఆస్కారం ఉంది.

సీఎంతో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల భేటీ



సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు

- పాల్గొన్న మంత్రులు దామోదరం రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదరం రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజల స్పందన గురించి సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలతో ఆరాతీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలనుకున్న ఆరు గ్యారంటీలను పూర్తి చేస్తామని, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. అభివృద్ధి పనుల కోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదరం రాజనర్సింహ ద్వారా ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేకు సూచించినట్లు సమాచారం. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను గెలుచుకునేలా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. పలువురు ఎమ్మెల్యేలు తమ అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎంకు విన్నవించారు. అలాగే అలంపూర్ నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలపై మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కూడా సీఎంకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ నీటిని వినియోగించుకోండి



కోయిల్‌సాగర్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

- ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ద్వారా విడుదల చేస్తున్న సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం వారు ప్రాజెక్టు నీటికి పూజలు చేసిన అనంతరం కుడి, ఎడమ కాల్వల ద్వారా పంటల సాగు కోసం నీటిని వదిలారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు కింద ఉన్న రైతులు సాగునీటిని వృథా చేయకుండా అవసరం ఉన్న మేరకు వాడుకోవాలని, తడి పూర్తి అయిన రైతులు కింద ఉన్న రైతులకు నీటిని మళ్లించాలని తద్వారా చివరి ఆయకట్టు భూముల వరకు నీరందేలా చూడాలని కోరారు. మొత్తం అయిదు తడులుగా నీటిని వదలడానికి షెడ్యూల్ ఖరారు చేశారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని వారి సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. పాత ఆయకట్టు కింద ఉన్న రైతులు యాసంగి పంటలు సాగుచేసుకోవచ్చని కోరారు.

పర్యాటకంగా తీర్చిదిద్దుతాం..

కోయిల్‌సాగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు తెలిపారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన బోటులో వారు విహరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యం చేసిందని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చించి కోయిల్‌సాగర్‌లో అన్ని సౌకర్యాలను కల్పించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ ప్రతాప్‌సింగ్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, నాయకులు అంజిల్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, భరత్, నాగిరెడ్డి, వర్మ, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాపైన చిన్నారులు.. క్షేమంగా ఇంటికి

- రూ.9 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నించిన తండ్రి
- తల్లికి అప్పగించిన పోలీసులు

జడ్చర్ల: తాగుడు, జల్సాలకు అలవాటు పడిన ఓ తండ్రి తన ముగ్గురు బిడ్డలను అమ్మకానికి హైదరాబాద్‌కు తీసుకెళ్లగా.. పోలీసులు తల్లి చెంతకు చేర్చిన ఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. స్థానిక నిమ్మబావిగడ్డకు చెందిన హబీబున్నీసాకు భూత్పూర్ మండలం తాడిపర్తికి చెందిన రఫీక్‌తో వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల రుమానాబేగం, మూడేళ్ల రమీజ్, ఏడాది షోయబ్ పిల్లలున్నారు. ఈ కుటుంబం కొంతకాలంగా గౌరీశంకర్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. రఫీక్ తాగుడు, జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ఆదివారం తన ముగ్గురు పిల్లలను దుస్తులు కొనిస్తానంటూ నమ్మబలికి బైక్‌పై హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడి నుంచి భార్యకు ఫోన్‌చేసి పిల్లలను కిడ్నాప్ చేశానని, తనకు డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రఫీక్ ఫోన్ ట్రాక్‌చేసి హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందించగా.. చంచల్‌గూడ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. తండ్రి ఇచ్చిన ఆధారాలతో యాకుత్‌పురాలో ఓ కారులో పిల్లలను పోలీసులు, బంధువులు గుర్తించారు. కారులో ఉన్న వారిని ప్రశ్నించగా రఫీక్ తమకు రూ.9 లక్షలు ఇవ్వాల్సి ఉందని.. డబ్బులు తీసుకొస్తానంటూ పిల్లలను అప్పగించి వెళ్లాడని చెప్పి పరారయ్యారు. కాగా.. తన పిల్లలను రూ.9 లక్షలకు విక్రయించే ప్రయత్నం చేశాడని భార్య ఆరోపించింది. గోవాలో ఉంటున్న తన భర్త రఫీక్ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వేధిస్తుంటాడని వాపోయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



సీఎంఆర్‌ను వెంటనే పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ కింద మిగిలిపోయిన 10 శాతం బియ్యాన్ని త్వరితగతిన చెల్లించి యాసంగి సీఎంఆర్‌పై దృష్టిసారించాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా కలెక్టర్, పౌరసరఫరాల అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ సంవత్సరం వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ 90 శాతం లక్ష్యం సాధించినా మిగిలిన 10 శాతం వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరు నాటికి ప్రభుత్వం ఆదేశాల మేరకు యాసంగి సీఎంఆర్‌కు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మిల్లుల వారీగా సమీక్షించి చెల్లించాల్సిన బియ్యాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ మాట్లాడుతూ యాసంగి సీఎంఆర్‌పై దృష్టి పెట్టాలని, ప్రభుత్వం చౌకధర దుకాణాల ద్వారా అందిస్తున్న బియ్యం ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం కావడానికి వీల్లేకుండా చెప్పారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఈ నెల 17 నాటికి అన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆధార్, రేషన్ కార్డులేని దరఖాస్తుదారుల జాబితాను రూపొందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, శిక్షణ ఎస్పీ చిత్తరంజన్, డీసీఎస్ఓ ప్రవీణ్, డిపో గోడౌన్ మేనేజర్ అస్లాం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు శిక్షణ ఐపీఎస్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకు వచ్చిన శిక్షణ ఐపీఎస్ అధికారి చిత్తరంజన్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన చిత్తరంజన్ కొన్నిరోజులపాటు ప్రొహిబిషన్‌లో భాగంగా జిల్లాలో విధులు నిర్వహించనున్నారు.

ఆక్రమణలపై విచారణ షురూ



మౌలాలిగుట్ట సమీపంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాకేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రభుత్వ, చెరువు శిఖం భూములు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆక్రమణలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రభుత్వ స్థలాలు, శిఖం భూములు, డబుల్ బెడ్‌రూంలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాల్సిందిగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. కాగా ఈ విషయమై సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి చెరువు శిఖం భూములు, ఇతర ప్రభుత్వ స్థలాలు, అలాగే డబుల్‌బెడ్‌రూం ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో అర్బన్ తహసీల్దార్ రాధాకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, గిర్దావర్ నర్సింగ్ ఉన్నారు.

క్లుప్తంగా

పుట్టిన రోజే.. అనంతలోకాలకు

- కర్ణాటకలో రోడ్డు ప్రమాదం
- నారాయణపేట వాసి దుర్మరణం



వాసుదేవా ఆచార్య (ఫైల్)

నారాయణపేట రూరల్: ఆనందంగా పుట్టినరోజు వేడుక జరుపుకోవాల్సిన ఆ ఇంటా విషాదం అలుముకుంది. చేతికొచ్చిన కుమారుడు తనువు చాలించాడనే వార్త కుటుంబ సభ్యులకు తీరని మనోవేదనకు గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ వద్దనున్న మూల హనుమాన్ ఆలయ పూజారి శ్రీనివాస్ చిన్న కుమారుడు వాసుదేవా ఆచార్య (30) బీటెక్ పూర్తిచేసి, బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం తన జన్మదినం సందర్భంగా బైక్‌పై దైవదర్శనానికి వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతడి మృతిపై స్థానిక బాల కేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్‌కుమార్, బ్రాహ్మణ సంఘం నాయకులు సంతాపం తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



భూత్పూర్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం మండలంలోని పోతులమడుగు వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి(35) రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. లైన్ షర్టు, బ్లాక్ కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే సెల్: 8712659350 సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి..



జడ్చర్ల: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం 30 ఏళ్ల వయసున్న గుర్తు తెలియ ని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు తమను సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ?

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. లింగాల మండలం దారారంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) ఆధ్వర్యంలో 12 మంది ఎస్సీలకు పక్కాగృహాలు నిర్మించాలని నిర్ణయించారు. అయితే లబ్ధిదారులను గుర్తించడంలో గ్రామానికి చెందిన కొంతమంది నిబంధనలను అతిక్రమించినట్లు తెలిసింది. ఇళ్ల నిర్మాణానికి తహసీల్దార్ సంతకంతో కూడిన ధ్రువపత్రం (నివేశ స్థలం) తప్పనిసరి కాగా.. గ్రామానికి చెందిన కొందరు తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, సంబంధిత పత్రాలను ఆర్డీటీ వారికి సమర్పించారు. ఈ వ్యవహారం బయటికి పొక్కడంతో ఆర్డీటీ వారు ఆయా ధ్రువపత్రాలను పరిశీలన నిమిత్తం తహసీల్దార్‌కు పంపారు. ఈ విషయంపై ఆర్డీటీ ఏరియా టీం లీడర్ (ఏటీఎల్) రాధ స్పందిస్తూ.. దారారంలో ఎస్సీల నివేశ స్థలాల ధ్రువపత్రాలపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీలకు నిర్మించే ఇళ్ల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు.

పంచాయతీ పోరు ఇప్పట్లో లేనట్లే!

- ఎంపీ ఎన్నికల తరువాత ఉండే అవకాశం?





మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే పరిస్థితి లేనట్లే తెలుస్తోంది. 2023 డిసెంబర్ 7వ తేదీన కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వెంటనే షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తుందని అందరు భావించారు. అందుకోసం అధికారులు ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తే కింది స్థాయిలో కూడా ఏక పక్షంగా ఫలితాలు వస్తాయనే ఆలోచన కొత్త ప్రభుత్వంలో ఉంటుంది. కానీ ఏర్పడిన కొత్త ప్రభుత్వం (కాంగ్రెస్ పార్టీ) ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం వాటి అమలుపైనే దృష్టి పెట్టింది. వాటిలో రెండు పథకాలు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేయాల్సిఉంది. వాటిని పూర్తి చేశాక గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మేలు జరుగుతుందనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. మరోవైపు పార్లమెంట్ ఎన్నిక లు పూర్తయ్యాక నిర్వహిస్తే బాగుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందుకు సిద్ధంగా లేనట్లుగా తెలుస్తోంది.

2019 జనవరిలో ఎన్నికలు..

రాష్ట్రంలో 2019 జనవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. 2018 డిసెంబర్‌లో అప్పటి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించింది. ప్రస్తుతం 2024 ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలక వర్గాల కాల పరిమితి పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం కనీసం 15 రోజులు ముందుగానే ఎన్నికల తతంగం పూర్తి కావాలి. అంటే జనవరిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పైగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఇప్పటి నుంచే ఆ ప్రక్రియను ప్రారంభిస్తే తప్ప జనవరి 15వ తేదీ నాటికి ఎన్నికలను పూర్తి చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇంత వేగంగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లే ఆలోచనల్లో లేనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉంది. గ్రామాల్లో పార్టీ శ్రేణులు చెల్లాచెదురయ్యాయి. ఈ పరిస్థితుల్లో పథకాల అమలు, పార్లమెంటు ఎన్నికలు పూర్తి చేసుకోవడం ద్వారా గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులకు బలం చేకూర్చవచ్చనే ఆలోచనల్లో ఉన్నట్లు సమాచారం.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు..

స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. 6 శాతం నుంచి 10 శాతానికి ఎస్టీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు బీసీలకు కూడా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని యోచిస్తోంది.

అధికారులు సన్నద్ధం..

ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు మాత్రం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ప్రభుత్వం ఒకవేళ ముందుగానే ఎన్నికలు నిర్వహించాలంటే అప్పటికప్పుడు ఇబ్బందులు ఎదురవు తాయనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరం, తదితర వివరాలు అన్నింటిని సిద్ధం చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే!

లోక్‌సభ ఎంపీల పదవీకాలం 2024 మేతో పూర్తి కానుంది. వాటికి సంబంధించి ఓటరు నమోదు వంటి ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసే ఆలోచనల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. గ్యారంటీలను పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేసుకోవడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని ప్రభుత్వం ఎత్తుగడ. దానివల్ల ఎక్కువ మొత్తంలో ఎంపీ స్థానాలను గెలుచుకునే వీలుంటుందని నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలు పెట్టుకుంటే పథకాల అమలు, ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, కార్యాచరణ రూపకల్పన, అమలు వంటి వాటిలో ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలంటే కీలకమైన ఎంపీ స్థానాల ప్రత్యేక దృష్టి పెట్టే ఆలోచనల్లో ఉన్నట్లుగా సమాచారం. ఆ తరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే విజయావకాశాలు కాంగ్రెస్‌కు ఎక్కువ ఉండే అవకాశం ఉంటుందని, ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

లైసెన్స్ లేకుండా డ్రగ్స్ విక్రయం

- ఆర్ఎంపీపై కేసు నమోదు
- రూ.95వేల విలువజేసే మందులు సీజ్



పాలమూరు: ఎలాంటి అనుమతి లేకుండా డ్రగ్స్ విక్రయిస్తున్న ఆర్ఎంపీపై జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు కేసు నమోదు చేయడంతో పాటు నిల్వ ఉంచిన డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేష్‌కుమార్ నేతృత్వంలో శనివారం మహబూబ్‌నగర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రబియా, జడ్చర్ల ఇన్‌స్పెక్టర్ రఫీ సంయుక్తంగా జిల్లా కేంద్రంలోని పాలకొండలో దాడులు నిర్వహించారు. కొన్ని రోజులుగా మురహరి అనే వ్యక్తి ఆర్ఎంపీగా చెలామణి అవుతూ, లైసెన్స్ లేకుండా న్యూలైఫ్ కేర్ క్లినిక్‌లో డ్రగ్స్ విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 36 రకాల డ్రగ్స్ గుర్తించామని, వీటి విలువ రూ.95వేలు ఉంటుందని ఏడీ దినేష్‌కుమార్ తెలిపారు. లైసెన్స్ లేకుండా డ్రగ్స్ నిల్వ ఉంచిన మురహరిపై ఔషధ నియంత్రణ చట్టం 18(సీ) ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రగ్స్ విక్రయించినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



వెల్దండ మండలంలో ఎక్సైజ్‌దాడులో సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం/వెల్దండ/ తెలకపల్లి: జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావ్ తెలిపారు. జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, తెల్కపల్లి స్టేషన్ల పరిధిలో గుడుంబా స్థావరాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి 84లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 1565 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. 646 కిలోల నల్లబెల్లం, 220 కిలోల అల్లంను సీజ్ చేశామన్నారు. 15 కేసుల్లో 15మందిని అరెస్టు చేసి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

■ కల్వకుర్తి డివిజన్‌లోని పలు గ్రామాలు, తండాల్లో ఎక్సైజ్‌శాఖ ఎస్టీఎఫ్ అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. వెల్దండ మండలంలోని వెల్దండ, పోషమ్మతండా, తుమ్మలకుంటతండా, రాచూర్‌తండా, కొట్ర, వంగూర్ మండలంలోని కిష్టపల్లి, చారకొండ మండల కేంద్రంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో 49 లీటర్ల నాటుసారా, 615కిలోల నల్లబెల్లం, 200కేజీల అల్లం, వాటితో పాటు 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 8మందిపై కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరిచి వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్టీఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు తెలిపారు. ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ దాడులు చేశామని, ఇలాంటి దాడులు ఇంకా నిర్వహిస్తామని తెలిపారు.



నిందితులు, నాటుసారతో ఎక్సైజ్ అధికారులు

■ ఉప్పునుంతల మండలంలో రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాను మేరకు దాడులు చేశారు. దేవదానికుంట, కంసానిపల్లి తండాలలో 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రెండు నాటుసారా బట్టీలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ జనార్దన్ తెలిపారు. నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో మరో సీఐ గణపతిరెడ్డి, తెలకపల్లి ఎస్ఐ బాలవర్ధన్, ఎస్ఐ క్రాంతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉన్నారు.

యన్మన్‌గండ్లలో 'డబుల్' ఇళ్ల లొల్లి

- కేటాయించారంటూ ఇళ్ల వద్దకు వెళ్లిన గ్రామస్తులు
- అడ్డుకుని తిరిగి పంపించిన అధికారులు



యన్మన్‌గండ్లలో 'డబుల్' ఇళ్ల నుంచి గ్రామస్తులను బయటకి పంపుతున్న అధికారులు

నవాబుపేట: జడ్చర్లలో గత నెల చోటు చేసుకున్న ఘటన మాదిరిగానే తాజాగా యన్మన్‌గండ్లలో డబుల్ ఇళ్ల వివాదం సోమవారం జరిగింది. గ్రామంలోని కొందరు తమకు గత ప్రభుత్వం హయంలోనే ఇళ్లు కేటాయించారని సోమవారం వాటిని స్వాధీనం చేసుకున్నారు. విషయంపై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు వెళ్లి ఇళ్లలో ఉన్న వారిని బయటికి వెళ్లాలని ఆదేశించారు. కాగా వారు తమకు ఇళ్లు లేవని ఇక్కడే ఉంటామని భీష్మించారు. దీంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వారిని బలవంతంగా బయటికి పంపించారు. అక్రమంగా ఇళ్లలో ఉండడం నేరమని చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. కాగా గత ప్రభుత్వం యన్మన్‌గండ్లలో 48ఇళ్లు నిర్మించింది. వాటిని 2023 జనవరిలో ప్రారంభించారు. కానీ లబ్ధిదారులకు అందించటంలో ఆలస్యం చోటుచేసుకుంది.

హౌసింగ్ బోర్డు వారికి అప్పగిస్తాం..

యన్మన్‌గండ్లలో నిర్మించిన ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించలేదని... ఎవరు వాటిలో ఉండరాద తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తెలిపారు. ఇళ్లను హౌసింగ్ బోర్డు అధికారులకు అప్పగిస్తామని వివరించారు. తదుపరి ఆదేశాల అనంతరం కేటాయింపులు ఉంటాయని తెలిపారు.

వాతావరణ మార్పులతో మామిడిపై ప్రభావం

- కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి

కందనూలు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం మామిడి పూత దశలో ఉందని, శీతాకాలం నేపథ్యంలో పూత, ఖాత దశల్లో తీవ్ర ప్రభావం పడొచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే కొల్లాపూర్ మామిడికి ప్రత్యేక స్థానం ఉందని, ఆ ప్రాంతంలోనే సుమారు 40వేల ఎకరాల మామిడి తోటల సాగుందని తెలిపారు. వారం, పది రోజులుగా జిల్లాలో 15 నుంచి 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో మామిడి సాగుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం తెలిపారు. పూత మొగ్గలు విచ్చుకోకపోవడం, పూత ఆలస్యం అవడం, పిందె పట్టడానికి ఎక్కువ సమయం తీసుకోవడం, చెట్టు అంతా ఒకేసారి పూత రాకపోవడం, చెట్టు మీద పూత దఫదఫాలుగా వస్తుందని, పిందెలు త్వరగా పెరగకపోవడం ఇలాంటివి గమనిస్తుంటామని తెలిపారు. దీని నివారణ కోసం చెట్టు అంతా పూత రావడానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రాములు, సూక్ష్మ పోషక మిశ్రమం (ఎఫ్4) 5 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25 మి.లీ.,లీటర్ నీటికి చొప్పు కలిపి చెట్టు అంతా తడిచేలా పిచికారి చేయాలని సూచించారు. ఈ చలి వాతావరణంతో పాటు తేనె మంచు, పురుగు, బూడిద తెగులు వచ్చే అవకాశం ఉంటుందని, రైతులు ప్రతి రోజు పూతను గమనించి తెగులు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. బూడిద తెగులు, తేనె మంచు పురుగు నివారణకు థయోమిథాక్సమ్ 0.3 గ్రాములు, హెక్సాకొనజోల్ 2 మి.లీ.,లీటర్ నీటికి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలని తెలిపారు. చెట్టు అంతా పూత వచ్చిన తర్వాత నీటి తడులను అందించాలన్నారు. జాగ్రత్తలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు.

24 మందిపై కేసు నమోదు

బాలానగర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటన సందర్భంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న 24 మందిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నిందితులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు వారిపై దాడి చేశారని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నకిలీ పురుగు మందుల విక్రేతలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రవి



సీజ్ చేసిన నకిలీ పురుగు మందులు

- రూ.43 వేల విలువైన మందులు సీజ్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రవి

గద్వాల క్రైం: నకిలీ పురుగు మందులు విక్రయించే డీలర్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.43 వేల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ రవి వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కేసు వివరాలను వివరించారు. ఇటిక్యాల, అయిజకు చెందిన శ్రీనివాస ఆగ్రో ట్రేడర్స్, జై కిసాన్ ఎంటర్‌ప్రైజెస్ దుకాణాలకు చెందిన జావేద్ జమిల్, జావీద్ హుస్సేన్ ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించి పురుగు మందులను తక్కువ ధరకు కొనుగోలు చేసుకునేందుకు ఇరువురు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ నకిలీ పురుగు మందులను అయిజ, ఇటిక్యాల మండలంలోని మిరప రైతులకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు డీలర్లు ట్రైసర్, డెలిగెట్ కంపెనీ పురుగు మందులను నకిలీవి విక్రయిస్తున్నట్లు కొట్టివా కంపెనీ నిర్వాహకుడు కెవల్ సుదీర్ 2023, అక్టోబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. జావేద్ జమిల్, జావీద్ హుస్సేన్ నంద్యాల జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ వ్యక్తిగత ఖాతాలో నగదు జమ చేసి నకిలీ మందులు కొనుగోలు చేస్తున్నట్లు బయటపడింది. విజయకుమార్‌ను విచారించగా గుంటూరు జిల్లా ఉపాలపాడుకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి (ప్రస్తుత నివాసం ఆమనగల్, రంగారెడ్డి జిల్లా)కు చెందిన వ్యక్తి మందులు సరఫరా చేసినట్లు తేలింది. సదరు వ్యక్తిని విచారించగా రాజస్థాన్‌కు చెందిన అంకిత్, మధ్యప్రదేశ్‌కు చెందిన సున్నైన కార్యంలైన ముఠా సభ్యుల నుంచి మందులు సరఫరా చేస్తున్నట్లు బయటపడింది. గొలుసుకట్టుగా ఈ మందుల విక్రయాలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.43 వేల విలువైన నకిలీ పురుగు మందులను సీజ్ చేశామని.. త్వరలో ప్రధాన నిందితులను సైతం అదుపులోకి తీసుకుంటామని ఏఎస్పీ వివరించారు. అరెస్టయిన వారిలో మోహన్‌గౌడ్, జావేద్ జమీల్, జావేద్ హుస్సేన్, తిమ్మారెడ్డి, విజయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉండగా.. అంకిత్, సున్నైన కార్యం పరారీలో ఉన్నారు. సమావేశంలో సీఐ రామస్వామి, ఎస్ఐలు నరేష్, అశోక్‌బాబు తదితరులు ఉన్నారు.

తోడేళ్ల దాడిలో గొర్రెలు మృతి

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రానికి చెందిన మద్దిలేటి, రామాంజనేయులు గొర్రెల మేపు కోసం ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె శివారుకు వెళ్లా రు. బాధితుల వివరాల ప్రకారం ఆదివారం రాత్రి కాపరులు నిద్రలో ఉండగా ఒక్కసారిగా గొర్రెల గుంపుపైకి తోడేళ్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఐదు గొర్రెలు మృతి చెందగా, మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. మొత్తం రూ.70వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని గొర్రెల యజమానులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గంజాయి పట్టివేత



గంజాయిని పరిశీలిస్తున్న సీఐ రమేశ్‌బాబు తదితరులు

జడ్చర్ల: మండలంలోని బూరెడ్డిపల్లి శివారు 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఓ బ్యాగ్‌లో సోమవారం గంజాయి పట్టుబడిందని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగ్‌ను వదలి వెళ్లారని.. అనుమానంతో పరిశీలించగా అందులో సుమారు అర కిలో గంజాయి, ఒక చిన్న త్రాసు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఎవరో వ్యాపారం చేయడానికి వచ్చినట్లు అనుమానానం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీ

- భార్యాభర్తలు దుర్మరణం



ప్రమాద స్థలంలో హుస్సేన్, అసీనా మృతదేహాలు

పెద్దకొత్తపల్లి: ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం వావిల్లబావి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు వివరాల మేరకు.. చంద్రకల్‌కు చెందిన హుస్సేన్ (35), అసీనా (28) భార్యాభర్తలు. వీరిద్దరు పాత ఇనుప సామాను వ్యాపారం చేసుకొని జీవనోపాధి పొందేవారు. రోజు మాదిరిగానే పెద్దకొత్తపల్లిలో పాత ఇనుప సామాను కొనుగోలు చేసి, ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా.. వావిల్లబావి సమీపంలో హైదరాబాద్ డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి తల్లి మైబిబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తక్కువ నీళ్లతో పుచ్చసాగు

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి
- మెళకువలు పాటించాలి: ఏడీఏ సక్రియా నాయక్



అలంపూర్‌లో సాగుచేసిన పుచ్చపంట



పుచ్చకాయలు

అలంపూర్: వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో పుచ్చసాగు చేసుకునే అవకాశం ఉంటుంది. సరైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, కొద్ది పాటి మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియా నాయక్ రైతులకు సూచిస్తున్నారు. పుచ్చసాగుకు సంబంధించి రైతులకు పలు విషయాలను వివరించారు.

నేలలు, వాతావరణం: పుచ్చకాయ పక్వానికి వచ్చినప్పుడు అధిక ఉష్ణోగ్రతలు ఉంటే మంచి రుచి, నాణ్యత వస్తోంది. 23నుంచి 27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలతో కూడిన తేమ వాతావరణం అనుకులం. మురుగు నీరు ఇంకిపోయే వసతి గల ఇసుక, బంక మట్టినేలలు పుచ్చకాయ సాగుకు అనుకూలం. చౌడు, ఉప్పు నేలలు సాగుకు పనికి రావు.

రకాల ఎంపిక: ఆర్య జ్యోతి, ఆర్య మానిక్, సుగర్ బేబి, అపర్ణ, మధు బాల, మోహిన వంటి రకాలే కాక ప్రైవేటు సంస్థల సంకర విత్తనాలను విత్తుకోవచ్చు.

ఎన్ని విత్తనాలు అవసరం: హైబ్రిడ్ విత్తనాలైతే ఎకరానికి 300 గ్రాములు, మేలు రకాలైతే ఎకరానికి 600 నుంచి 1000 గ్రాముల వరకు అవసరం ఉంటుంది. జనవరి నెలలో ఈ పంట విత్తేందుకు అనుకూలం.

ఎలా నాటాలి: నాటే ముందు భూమిని నాలుగైదు సార్లు బాగా దున్ని భూ సారాన్ని బట్టి 8 నుంచి 10 అడుగుల దూరంలో 2 అడుగుల వెడల్పు గల నీటి కాల్వను తయారు చేసి లోపలి పక్క రెండువైపులా రెండు అడుగుల దూరంలో విత్తనాలు వేసుకోవాలి. విత్తే ముందు రోజు నీరు పెట్టాలి.

ఎరువుల యాజమాన్యం: విత్తనాలు వేయడానికి ముందు ఎకరానికి నాలుగు టన్నుల పశువుల ఎరువు లేదా 1 టన్ను వానపాముల ఎరువు, 150 కిలోల సూపర్, 40 కిలోల పొటాష్, 25 కిలోల యూరియా వేయాలి. 30 రోజుల తర్వాత పైపాటుగా 25 కేజీల యూరియా, పూత, పిందె సమయాల్లో 60 కిలోల కాల్షియం అమ్మోనియం సల్ఫేట్‌ను మొక్క మొదలుకు ఇరువైపుల గోతి తీసి ఎరువులు వేసి మట్టి కప్పాలి. తీగలు పాకే సమయంలో తల తుంచి సూక్ష్మ ధాతువులు మొక్కలకు అందేలా యఫ్–4ను 4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తీగలు సాగి నాణ్యమైన దిగుబడులు వస్తాయి.

కాయ కోత: పక్వానికి వచ్చిన కాయలను సాయంత్రం వేళల్లో కోసి ఉదయం రవాణా చేయాలి. కాయలను తడితే డొల్ల శబ్దం వస్తే కాయ పక్వానికి వచ్చిందని గుర్తించుకోవాలి.

సస్యరక్షణ: పుచ్చపంటకు ప్రధానంగా తామర పురుగు ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుంటాయి. దీని నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆల్టర్నేరియా మచ్చ తెగులు నివారణకు కార్బండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నీటి యాజమాన్యం

పంట ప్రథమ దశ వారం రోజుల వ్యవధిలో నీటి తడి ఇవ్వాలి. తర్వాత వాతావరణం, భూమి స్వభావాన్ని బట్టి 5 నుంచి 7 రోజులకు ఒకసారి తడి ఇవ్వాలి. పూత వచ్చే సమయంలో నీటి ఆపి కొంచెం బెట్ట పరిస్థితులు కల్పించి తర్వాత నీరు అందిస్తే పూత బాగ వచ్చి ఆడ పూల శాతం పెరుగుతుంది. కాయ ఎదిగేటప్పుడు నీటి ఎద్దడి లేకుండా చూడాలి. కాయలు పక్వానికి వచ్చిన తర్వాత నీరు ఎక్కువగా ఇస్తే కాయలు పగిలే అవకాశం ఉంది.



గురివింద.. గుంజీలు

విజయవాడ ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేసిన రామోజీ

- ఎట్టకేలకు యజమాని వల్లూరి రామకృష్ణ చేతికి స్థలం
- 40 ఏళ్లుగా పత్రిక పేరుతో నామమాత్రపు లీజుకే మూడెకరాలు
- రహదారి విస్తరణకు 20 ఏళ్లపాటు రాజ గురువు అడ్డంకులు
- లీజు ముగిసి పదేళ్లు దాటినా ఖాళీ చేయకుండా గురివింద తిష్ట
- ఎన్‌హెచ్ విస్తరణ పరిహారం టీడీఆర్ తనకే ఇవ్వాలని వివాదం
- ఎట్టకేలకు న్యాయస్థానం తీర్పుతో యజమానికి భూమి అప్పగించి పలాయనం
- విశాఖలోనూ ఇదే తరహాలో 'భూమోజీ' భూ అక్రమాలు



సాక్షి, అమరావతి: ఇరుకు రోడ్లతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఈనాడు యజమాని ఓ సంఘ సంస్కర్తలా వార్తలు అచ్చేస్తుంటారు!

...విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్‌లో రహదారి విస్తరణను రామోజీరావు 20 ఏళ్ల అడ్డుకున్నారు.

- ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను కబ్జా చేస్తున్నారు..! సామాన్యులు హడలిపోతున్నారంటూ ఈనాడు ఎక్కడలేని ఆవేదన వెళ్లగక్కుతుంది..
- బెజవాడ బెంజ్ సర్కిల్ వద్ద అత్యంత విలువైన మూడెకరాల భూమిని లీజు ముగిసినా పదేళ్ల పాటు ఖాళీ చేయకుండా స్థలం యజమానిని రామోజీ తీవ్రంగా వేధించారు.
- ఒకరికి దక్కాల్సిన నష్ట పరిహారాన్ని మరొకరు కాజేస్తున్నారంటూ ఈనాడు వాపోతుంది!
- రహదారి విస్తరణకు భూమి తీసుకుంటే అందుకు నష్ట పరిహారంగా ఇచ్చే టీడీఆర్ బాండ్లను భూ యజమానికి కాకుండా తనకే ఇవ్వాలంటూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు రామోజీ నోటీసులు పంపుతారు. వ్యవస్థలు, వ్యక్తులు, ప్రభుత్వాలను అడ్డు పెట్టుకుంటారు. దీన్ని ఎవరైనా ప్రశ్నిస్తే అది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ తన అక్రమాలకు పాత్రికేయం ముసుగు వేస్తారు.
- మానవత్వం, బంధుత్వాలకు అర్థం తెలియని చెరుకూరి రామోజీరావు ఓ మనిషి ఎలా ఉండకూడదో చెప్పేందుకు నిలువెత్తు నిదర్శనం! నిజం నిలకడ మీద తేలుతుంది. ఇన్నాళ్లకైనా ఆయనో కబ్జాదారు అని నిగ్గు తేలింది. ఇతరుల సొమ్మును అప్పనంగా కాజేసే దోపిడీదారుడని తేటతెల్లమైంది. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే సైంధవుడని నిరూపితమైంది. ఎట్టకేలకు రామోజీ పాపం పండటంతో విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో తాను కబ్జా చేసిన దాదాపు మూడెకరాల భూమిని ఖాళీ చేశారు. కొన్నేళ్ల క్రితం తన కబ్జాలో ఉన్న విశాఖ ఈనాడు కార్యాలయం భూమిని అసలు యజమానికి అప్పగించిన రాజ గురివింద ఇప్పుడు విజయవాడలోని స్థలాన్ని కూడా భూ యజమానికి అప్పగించి చిత్తగించారు. ఆ స్థలాన్ని ఖాళీ చేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేసి మరీ బయటకు వెళ్లాల్సి వచ్చింది. అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్న సత్యం మరోసారి రుజువైంది.

లీజు స్థలాన్ని కబ్జా చేసి..

విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్ సమీపంలో దాదాపు 3 ఎకరాల్లో ఉన్న భవనం అది. చూడగానే అరె.. ఇది ఈనాడు ఆఫీసే కదా అనుకోవడం సహజం! ఎందుకంటే 40 ఏళ్లకుపైగా అది అలాగే చెలామణి అవుతోంది మరి. ఈనాడు కార్యాలయంగా, రామోజీరావు ఆస్తిగా ముద్ర పడిపోయింది. కానీ వాస్తవం ఏమిటంటే... ఇప్పుడే కాదు అది ఎప్పుడూ ఈనాడు సొంత స్థలం కాదు. కబ్జా ముసుగులో చెరుకూరి రామోజీ చెరబట్టిన స్థలం అది. దాదాపు 3 ఎకరాల్లో ఉన్న ఆ భూమి అసలైన యజమాని వల్లూరి రామకృష్ణ. ఆయన ఆ భూమిని రెండు భాగాలుగా 1980లో రామోజీకి లీజుకిచ్చారు. రామోజీ తన తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు ద్వారా వల్లూరి రామకృష్ణను సంప్రదించి ఆ భూమిని 30 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. ప్రస్తుతం రూ.వందల కోట్ల మార్కెట్ విలువ ఉన్న భూమిని కేవలం వందల రూపాయలకే లీజుకు దక్కించుకున్నారు. అందులో 1.80 ఎకరాల విస్తీర్ణంలో ఈనాడు కార్యాలయ భవనాన్ని నిర్మించుకున్నారు. ఆ విధంగా ఆ భూమిని గుప్పిట పట్టిన తరువాత రామోజీ తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించారు. భూ యజమానులను ముప్పు తిప్పలు పెట్టారు. విజయవాడ అభివృద్ధికి అడ్డంకిగా నిలిచారు.

రోడ్డు విస్తరణను అడ్డుకుని..

విజయవాడ బాగా విస్తరించడం, ట్రాఫిక్ పెరగడంతో బెంజ్ సర్కిల్ సమీపంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీనిపై ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించిన తరువాత 2004లో విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రవీణ్ ప్రకాశ్ ఆ రహదారిని విస్తరించాలని భావించారు. ఈనాడు ఆఫీసుకు ముందు ఉన్న ప్రాంతం వరకు రహదారిని విస్తరించినా ఈనాడు నుంచి బెంజ్ సర్కిల్ మధ్య కీలక ప్రాంతం విస్తరణ సాధ్యం కాలేదు. రోడ్డు విస్తరణ కోసం ఈనాడు కార్యాలయం ప్రహరీని తొలగించేందుకు రామోజీ సమ్మతించలేదు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ రహదారి వెంబడి ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించే ప్రయత్నాన్ని కూడా రామోజీ అడ్డుకున్నారు. ఆ వరుసలో ఉన్న పలు వ్యాపార సంస్థలు, ఇతర కార్యాలయాల ప్రహరీలను తొలగించి రహదారిని విస్తరించినా ఈనాడు వద్దకు వచ్చేసరికి ఆగిపోయింది.

ఎన్‌హెచ్‌ఏఐకి బ్రేకులు

కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) సైతం రామోజీ అక్రమాలు, పరపతికి చేష్టలుడిగి చూస్తుండిపోవాల్సి వచ్చింది. బందరు- పుణె జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ 2018లో కార్యాచరణకు ఉపక్రమించింది. బందరు నుంచి విజయవాడ వరకు రహదారిని విస్తరించినా బెంజ్ సర్కిల్ సమీపంలోకి వచ్చేసరికి ఎన్‌హెచ్‌ఏఐకి బ్రేకులు పడ్డాయి. ఈనాడు కార్యాలయం ప్రహరీని తొలగించేందుకు రామోజీ ససేమిరా అనడంతో రహదారి విస్తరణ నిలిచిపోయింది. ఈ పరిణామాలతో 20 ఏళ్లుగా బెంజ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమే లభించలేదు. ప్రజలకు అవస్థ పడితే నాకేంటి అన్నట్టుగా రామోజీ నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. మరోవైపు రహదారులు విస్తరించకపోవడంతో రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ తన కర పత్రికలో నీతులు వల్లిస్తూనే ఉన్నారు.

బాండ్లు తనకే ఇవ్వాలంటూ..

బెజవాడ ఈనాడు కార్యాలయం భూమిని కాజేసేందుకు రామోజీ మడత పేచీ పెట్టారు. రహదారి విస్తరణ కోసం సేకరించే భూమికి పరిహారంగా భూ, భవన యజమానులకు జారీ చేసే ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లను తనకే ఇవ్వాలంటూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసు పంపించారు. భూ యజమాని అయిన రామకృష్ణకు కాకుండా తనకే ఇవ్వాలని రామోజీ వాదించడంతో మున్సిపల్ అధికారులు షాక్‌కు గురయ్యారు. దీనిపై న్యాయ వివాదంతో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. రామోజీ కోరుకుంది కూడా అదే! రహదారి విస్తరణ నిలిచిపోవాలన్నదే ఆయన ఉద్దేశం. అదే జరిగింది కూడా.

లీజు ముగిసినా గబ్బిలంలా..

బెంజ్ సర్కిల్ సమీపంలోని ఖరీదైన భూమిని హస్తగతం చేసుకోవాలనే దుర్బుద్ధితో భూ యజమానిని రామోజీ ముప్పుతిప్పలు పెట్టారు. లీజుకు తీసుకున్న కొద్ది రోజులకే వివాదం పెట్టుకున్నారు. తన పలుకుబడితో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. బెదిరింపులకు పాల్పడ్డారు. కనీసం లీజు గడువు ముగిసిన తరువాతైనా తన భూమి తనకు దక్కుతుందని వల్లూరి రామకృష్ణ ఆశించారు. 33 ఏళ్ల లీజు గడువు 2013తో ముగిసింది. అయినా సరే భూమిని ఖాళీ చేయకపోవడంతో రామోజీరావుతో సుదీర్ఘంగా వల్లూరి రామకృష్ణ, డాల్ఫిన్ అప్పారావుల న్యాయ పోరాటం సాగింది. ఏకంగా పదేళ్లపాటు తమ భూమి కోసం భూ యజమానులు పోరాడాల్సి వచ్చింది. ఎట్టకేలకు న్యాయం గెలిచింది. ఆ భూమిని ఖాళీ చేయాలని న్యాయస్థానం గతేడాది రామోజీని ఆదేశించింది.

అంతిమ విజయం ధర్మానిదే...

న్యాయస్థానం ఆదేశాల తరువాత కూడా తాను ఆక్రమించిన భూమిని ఖాళీ చేసేందుకు రామోజీరావు ఏడాది సమయం తీసుకున్నారు. కోర్టు ఇచ్చిన గడువు ఇటీవల 2023 డిసెంబర్ 31తో ముగిసింది. దీంతో దారులన్నీ మూసుకుపోవడంతో ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బెంజ్ సర్కిల్ సమీపంలోని ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అక్కడి యంత్రాలు, ఫర్నీచర్ తదితరాలను ఆటోనగర్‌లోని కార్యాలయానికి తరలించారు. ఎట్టకేలకు రామోజీ అక్రమ భూబాగోతానికి తెరపడింది. అసలైన యజమానులకు వారి భూమి దక్కింది. ఆ భూమిని తాజాగా ఓ వాణిజ్య సంస్థకు లీజుకు ఇచ్చారు. ఆలస్యమైనా సరే చివరికి న్యాయమే గెలుస్తుందని మరోసారి రుజువైంది.

పుట్టుక నుంచే కుట్ర..!

ఈనాడు కార్యాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయో రామోజీ భూ అక్రమాలకు అక్కడక్కడ కొనసాగాయి. ఈనాడు నెలకొల్పిన విశాఖలో కూడా భూ యజమానిని అదేవిధంగా మోసగించి ముప్పుతిప్పలు పెట్టారు. విశాఖలోని సీతమ్మధారలో మంతెన ఆదిత్య ఈశ్వరకుమార్ వర్మ కుటుంబానికి చెందిన 2.70 ఎకరాల భూమిలో ఈనాడు కార్యాలయాన్ని 1974లో ఏర్పాటు చేశారు. 33 ఏళ్ల లీజు గడువు ముగిసిన తరువాత ఆ భూమిని ఖాళీ చేసేందుకు రామోజీ మొండికేశారు. అంతేకాకుండా రహదారి విస్తరణ కోసం అందులో517 చ.మీటర్ల భూమిని విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇచ్చి అందుకు ప్రతిఫలంగా మరోచోట 872 చ.మీటర్ల భూమిని పొందారు. అసలు యజమాని అయిన వర్మ కుటుంబానికి దాన్ని అప్పగించకుండా రామోజీ దర్జాగా తమ పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఆ భూమి మార్కెట్ విలువ రూ.3 కోట్లు కావడం గమనార్హం. ఇక మార్కెట్ విలువ ప్రకారం రూ.32.5 లక్షల లీజు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తూ ఆ భూమిని గుప్పిట పట్టారు. లీజు ముగిసినా ఖాళీ చేయకపోవడంతో భూమి యజమాని వర్మ 2007లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో న్యాయస్థానాన్ని మోసగించేందుకు రామోజీ ఏకంగా ఫోర్జరీకి పాల్పడ్డారు. విశాఖ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఫోర్జరీ చేశారని వర్మ ఆధారాలతో నిరూపించడంతో రామోజీ కుట్ర బెడిసికొట్టింది. కుట్ర, ఫోర్జరీ కింద రామోజీపై కేసు కూడా నమోదు చేశారు. దీనిపై వర్మ సుప్రీం కోర్టు వరకు సుదీర్ఘ న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. చివరికి ధర్మమే గెలిచింది. సీతమ్మధారలో ఈనాడు కార్యాలయం ఉన్న భూమిని ఖాళీ చేసి భూ యజమానికి అప్పగించాలని సుప్రీంకోర్టు 2012లో ఆదేశించింది. దాంతో రామోజీ తోక ముడిచి ఆ భూమిని ఖాళీ చేసి ఈనాడు కార్యాలయాన్ని నగర శివారులో పెందుర్తి సమీపంలోకి తరలించారు.

ఎంపీ సీటు రూ.150 కోట్లకు చంద్రబాబు అమ్ముకున్నారు

- గుడివాడలో రూ.100 కోట్లు ఇచ్చినోడికి టికెట్: కొడాలి నాని ఫైర్
- తెలంగాణ సీఎం రేవంత్‌కు ఎందుకు ఫోన్ చేయాలి
- కేసీఆర్‌కు శస్త్రచికిత్స జరిగింది కాబట్టి జగన్ వెళ్లి పరామర్శించారు
- రేవంత్‌రెడ్డిని పరామర్శించడానికి ఆయనకు ఏమీ విరగలేదు కదా!



సాక్షి, అమరావతి: చంద్రబాబునాయుడు సీట్లు అ మ్ముకుంటున్నారని, రూ.150 కోట్లకు ఎంపీ సీటు కేశినేని చిన్నికి అమ్మారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చెప్పారు. తాడే పల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమ వారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కోసం అహర్నిశలు పనిచేసిన కేశినేని నానిని చంద్ర బాబు మోసం చేశారని విమర్శించారు. గుడివాడ లో కూడా రూ.100 కోట్లు ఇచ్చినోడికి సీటిచ్చారని తెలిపారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ సీట్లు కూడా చంద్ర బాబు అమ్ముకుంటారని మండిపడ్డారు. ఇంకా ఆయన ఏన్నారంటే..

రేవంత్‌ను కలవాల్సిన అవసరం ఏముంది?

తెలంగాణలో మేం ఏ పార్టీకి మద్దతు తెలపలేదు. ఆ రాష్ట్ర సీఎం గురించి ఇక్కడ చర్చ అనవసరం. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున ఎన్నికైన సీఎం. ఆయ నది ఏమైనా ప్రాంతీయ పార్టీనా? ఆయన ఏమైనా సుప్రీమా? ఆయనకు ఏందీ ఫోన్‌చేసేది. రేవంత్ ముఖ్య మంత్రి అయినందుకు సీఎం వైఎస్ జగన్ కంగ్రాట్స్ చెబు తూ ట్వీట్ చేశారు. చంద్రబా బు అయితే ఎవరు సీఎం అవుతారా అని చూస్తుంటారు. రేవంత్‌రెడ్డిని సీఎం జగన్ ప్రత్యేకంగా ఎందుకు కలుస్తారు. తుంటి ఎ ముక విరిగినందుకు మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం జగన్ పరామర్శించారు. రేవంత్‌ను పరామర్శించ డానికి ఆయనకు తుంటి ఎముక విరగలేదు కదా?. ఏపీలో సీట్లు ఎవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుంది. రేవంత్ చెప్తే ఇక్కడ సీట్లు ఇవ్వరు. ఇక్కడికి వచ్చి రాజకీయం చేయాలి అనుకుంటే తెలంగాణలో సీఎం పదవికి రాజీనామా చేసి ఏపీలో పోటీ చేయాలి. ఆయనే ఆంధ్రాలో పీసీసీ అధ్యక్షుడు అయినా మాకేం అభ్యంతరం లేదు. చంద్రబాబును గెలిపించేందుకే షర్మిలను వినియోగించుకుంటున్నారు. మా సీఎంను కలిసేందుకు మాకు సమయం సరిపోవడం లేదు. పక్క రాష్ట్రం సీఎంను కలసి మేం ఏం చేస్తాం. పక్క రాష్ట్రాల రాజకీయాలు పట్టించుకునే స్థితిలో మా నాయకుడు, మేము లేం. ఏబీఎన్ రాధాకృష్ణవి అన్నీ వెకిలి ప్రోగ్రాములు. ముగ్గురిని కంటే రూ.45 వేలు ఇస్తానని చంద్రబాబు అంటున్నారు. అదే రూ.45 వేలు ఇచ్చి వాళ్ల పప్పుగాడిని పిల్లలను కనమని చెప్పాలి. వాడినే ఐదారుగురిని కనమని చెప్పాలి.

ఫిరాయింపుదారులపై అనర్హత వేటు!

- నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీల విషయంలో వైఎస్సార్‌సీపీ చర్యలు.. లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్‌కు ఫిర్యాదు

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం సీరియస్ అయ్యింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు సోమవారం ఫిర్యాదు చేసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేసి శాసనసభకు ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్ర శేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి పార్టీ ఫిరాయించారు. వారిపై చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచా ర్యులుకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ అభ్య ర్థులుగా పోటీ చేసి శాసనమండలికి ఎన్నికైన వంశీకృష్ణ, సి.రామచంద్రయ్యలు పార్టీ ఫిరా యించారు. వారిపైనా చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు ఎమ్మెల్సీలు మేరుగు మురళి, లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు.

మద్దిమడుగు అంజన్న హుండీ ఆదాయం రూ.35,63,159

అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి హుండీని సోమవారం దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. దీక్షమాల విరమణ ఉత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం రూ.35,63,159 వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా మిశ్రమ వెండి 2కిలోల 620 గ్రాములు వచ్చినట్లు వెల్లడించారు. హుండీ డబ్బులు, కానుకలను పదర ఏపీజీవీబీలో భద్రపరిచినట్లు చెప్పారు. సర్పంచ్ అంజమ్మ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈఓ రంగాచారి తదితరులు పాల్గొన్నారు.



దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలి



ఎండీసీఏ మైదానంలో గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, హెచ్‌సీఏ ప్రతినిధులు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- గ్రామీణ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం: హెచ్‌సీఏ అధ్యక్షుడు
- ఎండీసీఏ మైదానంలో డ్రెసింగ్‌రూమ్, కార్యాలయం ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రికెట్ క్రీడాకారులు జాతీయజట్టుకు ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో ఎస్‌ఆర్‌ఐ టి.రాంచంద్రారెడ్డి ఆర్థికసాయంతో నిర్మించిన క్రీడాకారుల డ్రెస్సింగ్ రూమ్ (పెవిలియన్), కార్యాలయ గదిని ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హెచ్‌సీఏ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యెన్నం మాట్లాడుతూ తానూ క్రికెట్ ఆడానని, రాష్ట్రస్థాయిలో, యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించానని తెలిపారు. క్రికెట్ పరంగా హైదరాబాద్ తర్వాత మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేయాలని హెచ్‌సీఏ ప్రతినిధులను కోరారు. క్రికెట్ అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. బీసీసీఐ, హెచ్‌సీఏ ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తాను గ్రామీణ స్థాయి నుంచి వచ్చానని, గ్రామీణ క్రీడాకారులకు అన్ని విధాల ప్రోత్సాహం ఉంటుందన్నారు. జిల్లా నుంచి కనీసం ముగ్గురు క్రీడాకారులు రంజీస్థాయికి ఎదగాలని కోరారు. క్రికెట్‌లో మహబూబ్‌నగర్ మరో హైదరాబాద్‌గా మారాలన్నారు. ఎండీసీఏ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అంచలంచెలుగా ఎదుగుతూ మంచి క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి హెచ్‌సీఏ సహకారం ఇస్తున్నట్లు తెలిపారు. 20 ఏళ్ల తర్వాత రంజీ జట్టులో స్టాండ్‌బైగా గణేష్ ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా నుంచి మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్, ఉపాధ్యక్షులు దల్జిత్‌సింగ్, కోశాధికారి శ్రీనివాసరావు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, సురేష్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీకాంతరావు, వెంకటరామారావు, చంద్రకుమార్‌గౌడ్, క్రిష్ణమూర్తి, గోపాలకృష్ణ, అబ్దుల్లా, మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో వైభవంగా చండీయాగం





ప్రత్యేక అలంకరణలో మైసమ్మ దేవత.. మైసమ్మ దేవాలయంలో యాగం నిర్వహిస్తున్న భక్తులు

నవాబుపేట: మండలంలోని మైసమ్మ అడవి వేద మంత్రాలతో మార్మోగింది. సోమవారం ఉత్సవాల్లో భాగంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి యాగం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, దేవాలయ అధికారి మధనేశ్వర్ రెడ్డి పూర్ణాహుతి సమర్పించారు. మంగళవారం శకటోత్సవం, 116 బోనాలతో నైవేద్యాల సమర్పణ ఉంటుందని దేవాలయ చైర్మన్, ఈఓ తెలిపారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ చైర్మన్ కృష్ణయ, అధికారి మధనేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం సన్మానించి, ప్రసాదం అందజేశారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్‌రూరల్: శాసనసభ ఎన్నికల్లో ఎంతో కష్టపడ్డ కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లోనూ సైనికుల్లా పనిచేయాలని అప్పుడే పేదలకు, బడుగు, బలహీనులకు సరైన న్యాయం చేయగలుగుతామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకున్న మనం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. శాసన సభ ఎన్నికల్లో మద్యం, డబ్బులు విపరీతంగా పంచడం వల్లే మనం వెనుకంజలో ఉన్నామని, భవిష్యత్‌లో మనం పనిచేయగలిగితే గెలుపు సాధ్యమవుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టామని గెలుపోటములు అందరికి సహజమేనని, అలాంటప్పుడు మనోధైర్యాన్ని కోల్పోవద్దని పేర్కొన్నారు. మనం ఓటమి పాలైనప్పటికి ఇప్పటికి పార్టీలో చేరేందుకు అనేకమంది ముందుకు వస్తున్నారని తెలిపారు. చంద్రకల్, దేశిటిక్యాలలో ఆయన పార్టీ జెండాలను ఎగురవేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్‌లో ఆయనకు కార్యకర్తలకు ఘనంగా స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

పేదల కష్టాలు పోవాలంటే బీఎస్పీని ఆదరించాలి

పెద్దకొత్తపల్లి: రాష్ట్రంలో పేదల కష్టాలు తొలిగిపోవాలంటే బీఎస్పీని ప్రజలు ఆదరించాలని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చంద్రకల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొత్తపల్లి కుమార్, శేఖరయ్య, బ్రహ్మయ్య, వర్మ, సరస్వతి, జగన్, లోకేష్, కృష్ణ, లక్ష్మీపతి, శేఖర్, భానుచందర్, కుర్మయ్య, రమేష్, సాయిరాం పాల్గొన్నారు.

రాముడు అందరికీ ఆదర్శప్రాయుడు



ఎస్పీ యోగేష్ గౌతమ్‌కి అక్షతలు అందిస్తున్న వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు

నారాయణపేట/ నారాయణపేట రూరల్: పితృవాక్య పరిపాలన, ఏకపత్నీవ్రతుడైన రాముడు ప్రతి ఒక్కరికి ఆదర్శనీయుడని.. అయోధ్య రామమందిరం దర్శనానికి సర్వపాప హరణమని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పండరినాథ్, ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి అన్నారు. అయోధ్య నుంచి తెచ్చిన అక్షతలను సోమవారం కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్‌గౌతమ్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు అందించారు. అదేవిధంగా పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల కల అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తికావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ జీవితకాలంలో అయోధ్యను సందర్శించాలన్నారు. నేటి తరానికి రామాయణాన్ని తెలియచేయాలని, పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు క్యాతన్‌రఘునాథ్, ప్రవీణ్, మీలగిరికాంబ్లే, బజరంగ్‌దళ్ నాయకులు శ్రవణ్, ఆకాష్, పెద్దలు పాల్గొన్నారు.

శక్తిపీఠం స్వామీజీకి అయోధ్య ఆహ్వానం

విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికారులు శక్తిపీఠంను సందర్శించి ఈ నెల 22న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి , రాముల వారి దివ్య ప్రతిష్టా మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా శక్తి పీఠం వ్యవస్థాపకుడు స్వామి శాంతనంద్ పురోహిత్‌కు ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని అందించారు. రాష్ట్ర శాఖ తరఫున ప్రముఖ స్వామీజీలకు అయోధ్య ఆహ్వానం పలికినట్లు వీహెచ్‌పీ రాష్ట్ర కమిటీవారు తెలిపారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్, ఉపాధ్యక్షులు జగదీశ్వర్, ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి, దుర్గావాహిని రాష్ట్ర కన్వీనర్ సక్కుబాయి తదితరులు ఉన్నారు.

తలనీలాలకు రూ.1.51 కోట్లు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన తలనీలాలకు ఈ–టెండర్ నిర్వహించగా.. రాజా ఎంటర్‌ప్రైజెస్ (హిందూపూర్) వారు రూ.1,51,76,757లకు దక్కించుకున్నట్లు ఆల య చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజులు సోమవారం ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల పాటు తలనీలాల సేకరణకుగాను మూడు సార్లు ఈ–టెండర్ నిర్వ హించగా, ఎవరూ పాల్గొనలేదని.. నాలుగో సారి టెండర్ ఖరారైందని పేర్కొన్నారు.



తప్పని సర్కస్ ఫీట్లు..

ఈ చిత్రాలు నారాయణపేట పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌కు సంబంధించినవి. బస్టాండ్ నుంచి వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు చుట్టూ తిరిగి రావడం ఇబ్బంది అవుతుందంటూ బస్టాండ్ పక్కనే ఉన్న మినీ స్టేడియం గ్రౌండ్‌ను షార్ట్‌కట్‌లా చాలా ఏళ్లుగా ఉపయోగిస్తున్నారు. అయితే ఇటీవల కలెక్టర్ మైదానానికి రక్షణ కల్పించాలని, వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా గేట్లు ఏర్పాటు చేయించారు. పాదచారులకు వీలుగా చిన్నగేటు తెరిచి ఉంచేవారు. కానీ ఆదివారం సాయంత్రం నుంచి అధికారుల ఆదేశం అంటూ గేట్లకు తాళం వేయడంతో విషయం తెలియక బస్టాండ్ వైపు నుంచి మైదానంలోకి వచ్చిన విద్యార్థులు, యువకులు ఇలా గేటు ఎక్కి వెళ్తూ సర్కస్ ఫీట్లు చేయడం కనిపించింది.

– నారాయణపేట రూరల్

నేడు కేంద్ర మంత్రి రాక

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను మంగళవారం కేంద్ర ఆరోగ్య కుటుంబ శాఖ మంత్రి సత్యపాల్ సింగ్‌బఘేల్ దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 12నుంచి 12:30 గంటల సమయంలో ఆలయాలను దర్శించుకుంటారని సంబంధిత అధికారులు దేవస్థానం వారికి సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమై అవసరమైన ఏర్పాట్లు చేశారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తి నీటి మట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేసారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 350 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.